క్లుప్తంగా

ఫిర్యాదులు గడువులోగా పరిష్కరించాలి



నారాయణపేట: ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 32 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని జిల్లా కేంద్రంలోనే కొనసాగించాలి

నారాయణపేట: ప్రజలకు అన్ని విధాలుగా అనువుగా ఉండి వైద్య సేవలకు అనుకూలంగా ఉన్న ప్రభుత్వ జిల్లా జనరల్ ఆస్పత్రిని పట్టణానికి 13 కిలోమీటర్ల దూరంలో గడ్డమీది అప్పక్‌పల్లి గ్రామానికి తరలించడం అన్యాయమని.. వెంటనే జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.వెంకట్రామరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరామ్ అన్నారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే జిల్లా జనరల్ ఆస్పత్రిని జిల్లా కేంద్రానికి మార్చాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో దాదాపుగా రూ.8 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం నిరుపయోగంగా ఉందని ఈ భవనంలో ప్రభుత్వ ఆస్పత్రిని కొనసాగించాలని కోరారు.

నర్వ ఎస్‌ఐగా పబ్బతి రమేష్

నర్వ: మండల నూతన ఎస్‌ఐగా పబ్బతి రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన కురుమయ్య ఎస్పీ కార్యాలయానికి వీఆర్‌పై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు పెద్దపీట వేస్తామని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కర్ని లింగమయ్య ఉత్సవాలు ప్రారంభం

మక్తల్: మక్తల్ మండలం కర్ని గ్రామంలో లింగమయ్య స్వామి ఉత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏటా రెండు రోజులు పాటు జరిగే శ్రీలింగమయ్య స్వామి వారి వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి కృష్ణానది నుంచి పుష్కర నీటిని తీసుకొచ్చి స్వామి వారికి పుష్కర స్నానం చేశారు. అనంతరం పురవీధుల గుండా స్వామివారి ఉత్సవ విగ్రహానికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన కాగు కుండలల తయారు చేసిన నైవేద్యం సమర్పణ కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నారు.

గడువు పొడిగించాలి

నారాయణపేట రూరల్: వికలాంగుల సహాయ పరికరాలు పొందేందుకు దరఖాస్తు గడువు ఈ నెలాఖరు వరకు పొడిగించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అడిషనల్ కలెక్టర్ సంచిత్ గగవార్‌కు వినతిపత్రం అందించింది. కార్యక్రమంలో కాశప్ప, బాల్ రాజు, బస్వరాజు, సంజీవ్, కథల్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దుల మృతి

మక్తల్: విద్యుత్ షాక్‌తో రెండు ఎద్దులు మృతి చెందిన ఘటన మాద్వార్ గ్రామంలో జరిగింది. మక్తల్ మండలం మాద్వార్‌కు చెందిన కుర్వ వెంకటరమణ, లక్ష్మీకాంత్‌కు చెందిన రెండు ఎద్దులు పొలంలో మేత కోసం వెళ్లాయి. మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లగా ఎర్తు వైర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మరణించాయి. పొలం వద్దకు వెళ్లి చూడగా మరణించి కనిపించడంతో రైతులు బోరున విలపించారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

డాక్టర్ రాంబాబు సేవలు చిరస్మరణీయం

నారాయణపేట రూరల్: డాక్టర్ రాంబాబు వైద్యరంగంతో పాటు ఆధ్యాత్మికపరంగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు అన్నారు. మండలంలోని లోకాయ పల్లి లక్ష్మమ్మ దేవాలయంలో కమిటీ ఆధ్వర్యంలో రాంబాబు చిత్రపటానికి సోమవారం శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి దేవాలయ కమిటీలో కీలకంగా ఉంటూ ఎన్నో రకాల ధార్మిక కార్యక్రమాలు చేపట్టారని, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడారని ఆయన సేవలను కొనియాడారు.

పంట మార్పిడితో అధిక లాభాలు



మాగనూర్ శివారులో ఆరుతడి పంటలను పరిశీలిస్తున్న ఏఓ (ఫైల్)

- ఒకే పంటతో చీడపీడల ముప్పు
- పంట మార్పిడితో భూసారం వృద్ధి

మాగనూర్: పంట మార్పిడి చేసుకుంటే రైతులు అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఏళ్లుగా ఒకే పంటను సాగు చేస్తే భూమి నిస్సారంగా మారి చీడపీడల వ్యాప్తి పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ సూచిస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో పంటల సాగుపై అన్నదాతలకు పలు సలహాలు, సూచనలు అందించారు. వానలు కురుస్తుండడంతో అన్నదాతలు పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో ఏటా సాగు చేసే పంటనే సాగు చేస్తే దిగుబడి తగ్గడంతో పాటు నష్టాలు చవిచూడాల్సి ఉంటుంది. అదే పంట మార్పిడి చేస్తే భూమిలో నీరు నిలిచే భూసారం వృద్ధి చెందుతుంది. అలాగే చీడపీడలు, తెగుళ్ల వ్యాప్తి తగ్గి, నేల భౌతిక స్థితి మెరుగుపడుతుంది. బీజాలు, వాటి అవశేషాలు, వానపాములు అభివృద్ధి చెంది భూమికి బలాన్ని చేకూరుస్తాయి. దీంతో కీటకాల గుడ్లు వృద్ధి చెందకుండా ఉంటాయి. పంట దిగుబడిలో నాణ్యత పెరిగి మద్దతు ధర పొందే వీలుంటుంది.

రైతులు పాటించాల్సినవి..

- భూమిలో తేమను నిల్వ చేసే శక్తి ఉంటే ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి.
- తేలికపాటి నేలలు, ఎర్ర, ఇసుక నేలల్లో మిశ్రమ పంటలు సాగు చేసుకోవాలి.
- వర్షాలు ఎక్కువ కురిసే ప్రాంతాల్లో కంది, నువ్వులు, వేరుశెనగ సాగు చేయడం మంచిది.
- పంట మార్పిడి చేసే ఏడాదిలో బంకమన్ను శాతం ఎక్కువ ఉండే ఎర్ర, నల్లరేగడి నేలల్లో రెండు పంటలు సాగు చేయొచ్చు.

ఏ పంట తర్వాత ఏ పంట వేయాలంటే..

- యాసంగిలో వేరుశెనగ సాగు తర్వాత వానాకాలంలో మొక్కజొన్న పంట వేసుకుంటే పైరుకు నత్రజని లభిస్తుంది. దీంతో రసాయన ఎరువుల వినియోగం తగ్గించవచ్చు.
- కంది, శనగ పంటలను వరుసగా వేస్తే కాయ తొలుచు పురుగు తాకిడి అధికంగా ఉంటుంది.
- అందుకే ఈ పురుగులు తక్కువ ఆశించే జొన్న, సోయాచిక్కుడు, నువ్వులు, మినుము, ఉలువ, మెట్ట వరితో పంట మార్పిడి చేసుకుంటే వేరుశెనగకు నులిపురుగుల బెడద తగ్గుతుంది.
- పొద్దు తిరుగుడు అనంతరం కొర్ర, జొన్న , సజ్జ వంటి చిరుధాన్యాలు లేదా కంది, శనగ, మినుము వంటి అపరాల పంటలను లేదా వేరుశెనగతో మార్పిడి చేసుకోవచ్చు.
- వంకాయ తోట తర్వాత కాలీఫ్లవర్ పంట మార్పిడి చేసుకుంటే మళ్లీ వంకాయకు ఎండు తెగులు సోకదు.
- టమాట, ఆవాలు, బంతి ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేస్తే నులి పురుగుల ఉధృతి తగ్గుతుంది.

ఈ మెలకువలు పాటించడం తప్పనిసరి..

- పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటల్ని ఎంపిక చేసుకోవాలి. శనగ, బబ్బెర, పెసర, మినుము పంటలను ఎంపిక చేయడం ఉత్తమం.
- వరి తర్వాత మినుము, పెసర, వేరుశనగ, చెరుకు వేయడం వలన సుడిదోమ, తుంగ్రో వైరస్ నివారించవచ్చు.
- పత్తి సాగు చేసిన నేలలో మినుము, పెసర సాగు చేస్తే తెల్ల దోమ ఉధృతి తగ్గుతుంది.
- వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, సజ్జ, పొద్దు తిరుగుడు వంటి ఆరుతడి పంటలు సాగు చేయడం మంచిది.
- నులిపురుగులు ఉన్న ప్రదేశంలో వేరుశనగ, మిరప, వంకాయ సాగు చేయడం మంచిది కాదు.

అధికారుల సూచనలు పాటించాలి



రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంట మార్పిడి చేయడం మంచిది. పంట మార్పిడికి అనుకూలమైన పంటలను ఎంచుకోకుంటే చీడపీడల ఉధృతి ఎక్కువ అవుతుంది. బెండ తర్వాత పత్తి వేస్తే ఉపయోగం ఉండదు. ఎదుకంటే ఈ రెండు పంటలను ఒకే రకమైన చీడపీడలు ఆశిస్తాయి. జొన్న వేసిన చేన్లలో మిరప వేయకూడదు. పసుపు తర్వాత మిరప, టమాటా, క్యాబేజీ, దోస, గుమ్మడి, సొర, బీర, పత్తి, ఆవాలు, బెండ వేసుకోకూడదు. ఆకుముడత ఆశించే ప్రాంతాల్లో వేరుశనగ, సోయా చిక్కుడు వేయకపోవడం మంచిది.

– సుదర్శన్‌గౌడ్, మండల వ్యవసాయ అధికారి మాగనూర్

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



అప్పిరెడ్డి పల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఎస్‌ఓ భాను ప్రకాష్ అన్నారు. మండలంలోని అప్పిరెడ్డి పల్లి, కోటకొండ, కొల్లంపల్లి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. అదేవిధంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న విద్యా బోధన, సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు.

మానవపాడు: ప్రైవేట్ బడులకు దీటుగా ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ తెలిపారు. బడి బాటలో భాగంగా ఉపాధ్యాయులు శ్రీలేఖ, అలియా తబసుమ్‌తో కలిసి సోమవారం ఇంటింటికి తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచరు విమల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోస్గి రూరల్: తపస్ ఉపాధ్యాయశాఖ వారి ఆధ్వర్యంలో చేపట్టిన 'బడిబాట' ప్రచార రథానికి విశేష స్పందన లభించిందని గుండుమాల్ మండల తపస్ అధ్యక్షుడు రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి అనంతయ్య అన్నారు. సోమవారం హన్మాన్‌పల్లి , భక్తిమళ్ల , సారంగారావుపల్లి , కొమ్మూర్, అమ్లికుంట, ముదిరెడ్డిపల్లి , గుండుమాల్ మండల కేంద్రంలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

కృష్ణా: చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వ బడుల్లో చదువులు ఉత్తమమైనవని మురహర్‌దొడ్డి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అజయ్ అన్నారు. సోమవారం గ్రామంలో బడిబాట కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు.

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేయనున్న ఏకరూప దుస్తులను ఎంఈవో మురళీధర్‌రెడ్డి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. బడులు ప్రారంభం కానుండడంతో దుస్తులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు.

మాగనూర్: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మాగనూర్ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రాజిరెడ్డి తెలిపారు. సోమవారం గ్రామంలో ఇంటింటికి వెళ్లి బడి ఈడు పిల్లల సర్వే నిర్వహించడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని నిడ్జింత ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అలాగే బడి మానేసిన విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించడమే ధ్యేయంగా బడిబాట కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

మూడు దశాబ్దాల ఉద్యమ ఫలితమే ఎస్సీ వర్గీకరణ

నారాయణపేట: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ మూడు దశాబ్దాల ఉద్యమంతో సాధించిన విజయమని ఎంఎస్‌పీ జాతీయ నాయకులు మంద నరసింహ మాదిగ, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రమోని యాదగిరి మాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు గోనిపాటి కళ్యాణ్ మాదిగ అధ్యక్షతన సోమవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దేశ అత్యున్నత పురస్కారం పద్మశ్రీ అవార్డు మందకృష్ణకు రావడంతో మాదిగ జాతితో పాటు అట్టడుగు వర్గాలకు దక్కిన గుర్తింపు, గౌరవమన్నారు. అలాగే జూలై 7న ఎంఆర్‌పీఎస్ 31వ వార్షికోత్సవాన్ని గ్రామ గ్రామాన ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు నాగేశ్, ప్రభుదాస్, అశోక్, జ్ఞాన ప్రకాష్, నరేశ్‌కుమార్, పానయ్య, కనకప్ప పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో వసతులు కల్పించాలి

నారాయణపేట రూరల్: విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. వేసవి సెలవులు ముగియడంతో విద్యా సంస్థలు తిరిగి ప్రారంభం అవుతున్న వేళ పాఠశాలు, కళాశాలల్లో సదుపాయాలు కల్పించాలని కోరుతూ డీఈఓ గోవిందరాజు, డీఐఈఓ సుదర్శన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రంగారెడ్డికు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ విద్యార్థులకు శుభ్రమైన తాగునీటిని అందించాలని అలాగే తరగతి గదుల్లో శానిటైజేషన్ చేయాలని కోరారు. పాఠశాలల్లో మరమ్మతు చేయించాల్సి ఉంటే తక్షణమే పూర్తి చేసి వర్షాకాలంలో నీరు కారే పరిస్థితి రాకుండా చూడాలన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



నారాయణపేట రూరల్: ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలన సాధించిన అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లాపురి శ్రీనివాస్, నాయకులు నాగురావు నామాజీ పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ అధ్యక్షతన సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని, 6 అబద్ధాలు 66 మోసాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. అన్ని వర్గాల ప్రజలు రోడ్డున పడ్డారని అన్నారు .బీఆర్ ఎస్, కాంగ్రెస్ దోచుకోవడంలో రెండు పార్టీలు ఒక్కటేనని, అంతే కాకుండా పదేళ్లు బీఆర్‌ఎస్ కే ట్యాక్స్ ఇప్పుడు కాంగ్రెస్ ఆర్ ఆర్ ట్యాక్స్ చెల్లిందని విమర్శించారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మన్నాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ వేసి ఇళ్ల పట్టాలు అందజేస్తున్న అధికారులు

కోస్గి రూరల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. మున్సిపల్ పరిధిలోని పోతిరెడ్డిపల్లి, మాసాయిపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సోమవారం భూమి పూజ, ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని, ప్రభుత్వం నుంచి విడతల వారీగా నిధులు మంజూరవుతాయని తెలిపారు.కార్యక్రమంలో బాల్‌రాజ్ , ఓంప్రకాష్ , వెంకట్రాములు, బందెప్ప, ప్రసన్నరెడ్డి పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల పరిధిలోని పెద్దాపూర్, తిమ్మారెడ్డి పల్లి, మన్నాపూర్ గ్రామ పంచాయతీలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం గృహ నిర్మాణ శాఖ ఏఈ, ఎంపీడీఓ కృష్ణారావ్‌తో కలిసి మార్కింగ్ వేశారు. కొత్తపల్లి మండలానికి 221 ఇళ్లు మంజూరు కాగా సోమవారం పైలెట్ ప్రాజెక్ట్‌కు ఎంపికైన గోకుల్‌నగర్‌తో పాటు మండల వ్యాప్తంగా 65 ఇళ్లకు మార్కింగ్ వేసి భూమి పూజలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో మండలంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు ఎంపీడీఓ కృష్ణారావ్ తెలిపారు. కార్యక్రమంలో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, నాయకులు చన్నప్ప, పార్థివ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎం మాట నిలబెట్టుకోవడం అభినందనీయం



మరికల్‌లో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



మంత్రి వాకిటి శ్రీహరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలకృష్ణా రెడ్డి

నారాయణపేట: మంత్రి వాకిటి శ్రీహరిని డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు చిట్టెం అభిజయ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం నారాయణపేట, మక్తల్, కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు సంగంబండ బాలకృష్ణారెడ్డి ఉన్నారు.

మరికల్: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని మంత్రి వర్గంలోకి తీసుకొని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సూర్యమోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే శ్రీహరికి మంత్రి పదవి దక్కడంతో సోమవారం మరికల్‌లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, వీరన్న, కృష్ణయ్య, హరీష్, రామకృష్ణ, గోపాల్, రాజు, ఆంజనేయులు, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

మక్తల్: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రాష్ట్ర మంత్రిగా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఆనందంగా ఉందని నియోజకవర్గానికి చెందిన బీకేఆర్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రవికుమార్ యాదవ్ ,మక్తల్ నాయకుడు గవినోళ్ల గోపాల్‌రెడ్డి , చెన్నయ్య సాగర్, డాక్టర్ బీంరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం మంత్రిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కోస్గి రూరల్: సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వాకిటి శ్రీహరికి క్యాబినెట్‌లోకి తీసుకొని ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించడం హర్షనీయమని జిల్లా ముదిరాజ్ అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరికి మంత్రి వర్గంలో చోటు కల్పించినందుకు సోమవారం పట్టణంలోని శివాజీ చౌరస్తాలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

నర్వ: ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సర్పంచుగా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి మంత్రి వరకు ఎదగడం ఎంతో అభినందనీయమని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం నర్వ అంబేద్కర్ చౌరస్తాలో బాణాసంచి కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

ఊట్కూరు: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వాకిటి శ్రీహరిని సోమవారం ఊట్కూరు మండల నాయకులు కలిసి సన్మానించారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసానికి వెళ్లి ఆయనకు శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు దుర్గం శ్రీనివాస్, శివరామారాజు, జగదీష్‌గౌడ్, లక్ష్మన్ పాల్గొన్నారు.

'నాయకులు కపట నాటకాలు ఆపాలి'



మాట్లాడుతున్న ఇథనాల్ పోరాట కమిటీ నాయకులు

మరికల్: ఇథనాల్ కంపెనీ ఏర్పాటుపై ప్రజాప్రతినిధులు ఆడుతున్న కపట నాటకాలను ఆపాలని ఇథనాల్ పోరాట కమిటీ నాయకులు చక్రవర్తి, చంద్రోశేఖర్ అన్నారు. మరికల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్ద ధన్వాడలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటుపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను నమ్మించేందుకు కంపెనీ రద్దు చేయిస్తామంటూనే ప్రారంభానికి చర్యలు తీసుకోవడం వల్లే ఆందోళనకు దారి తీసిందన్నారు. అలగే చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ విషయంలో అప్పట్లో అధికారంలో లేని కాంగ్రెస్, బీజేపీ నాయకులు తమ పోరాటానికి మద్దతు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. ఇథనాల్‌తో ప్రజలకు, మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. మెజార్టీ ప్రజలు అభిప్రాయాలను గౌరవించి కంపెనీలను రద్దు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓ శ్రీనువాసులుకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నర్వ: పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ శ్రీనువాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 16 నెలలుగా గ్రామాలకు పాలకవర్గాలు లేకపోయిన కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి నిధులు రాకపోయిన ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహిస్తున్నామన్నారు. ట్రాక్టర్‌ల డీజిల్ ఖర్చులు, తాగునీటి నిర్వాహణ, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వాహణ ఖర్చులకు నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఓపీఎస్‌లుగా పనిచేస్తున్న కార్యదర్శులను జేపీఎస్‌లుగా కన్వర్ట్ చేసి ఓపీఎస్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో గిడెన్, అర్జున్, రంజిత్ ఉన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

నర్వ: రెవెన్యూ సదస్సుల ద్వారా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం అన్నారు. సోమవారం పెద్దకడ్మూర్‌లోని అప్పంపల్లి శివారు, బెక్కర్‌పల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు మల్లేష్, ఆశా, సిబ్బంది బాలరాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జయరాములు తెలిపారు. నిడ్జింత గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించగా 28 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. భూ సమస్యలు ఉన్న రైతు లు గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకుంటే సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు.

మాగనూర్: ప్రతి ఒక్క రైతు భూభారతి సదస్సును సద్వినియోగం చేసుకోవాలని మాగనూర్ డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ కుమార్ అన్నారు. సోమవారం పుంజనూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేసి భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ రైతుల భూ సమస్యలు వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు తమ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోస్గి, గుండుమాల్ మండల తహసీల్దార్‌లు బక్క శ్రీనివాసులు, భాస్కరస్వామి అన్నారు. సోమవారం భూభారతి రెవెన్యూ సదస్సులో భాగంగా కోస్గి మండలంలోని ముశ్రీఫా, ముంగిమళ్లలో అలాగే గుండుమాల్ మండలంలోని భక్తిమళ్లలో సదస్సులు నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

ధన్వాడ: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ సింధూజ అన్నారు. సోమవారం ధన్వాడ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించగా పలువురు రైతులు దరఖాస్తులు అందజేశారు.

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నారాయణపేట రూరల్, నారాయణపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో భాగంగా వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఏఐపీకేఎంఎస్ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ. 12వేలు అందిస్తామని ప్రకటించి ఏడాదిన్నర అవుతున్నా ఇంతవరకు అమలు చేయకపోవడం సరికాదన్నారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

ధన్వాడ: ఎలాంటి షరతులు లేకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపచేయాలని తెలంగాణా ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రాజు కోరారు. ఈ మేరకు సోమవారం ధన్వాడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అలాగే ఉపాధిహామీ పని దినాలను రెండు వందల రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కృష్ణయ్య, శ్రీనివాస్, నర్సింములు పాల్గొన్నారు.